క్లుప్తంగా

భూగర్భజలాలు పరిశీలన

ఖానాపూర్: తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా పట్టణంలోని డబుల్ బెడ్ రూం కాలనీలో గురువారం అధికారులు భూగర్భజలాలను పరిశీలించారు. జియోలజిస్ట్ సుహాసిని సిబ్బందితో కలిసి కాలనీకి వెళ్లి నీటి సమస్యపై పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రౌండ్ వాటర్ లెవల్ స్థాయి పరిశీలించామని.. నివేదికను అధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వేసవిలో వడదెబ్బల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ శాఖల అధికారులు హాజరవుతారని.. సిబ్బంది సకాలంలో సమావేశానికి రావాలని కోరారు.

24న ఉచిత ధ్యాన శిబిరం

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీలోని చింతల్‌పేట్ గ్రామంలో విపశ్యన ధ్యాన కేంద్రంలో ఈనెల 24న ఉచిత ధ్యాన శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం నిర్వాహకుడు మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్యానంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగవుతాయని.. 10 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు శిక్షణ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామంలో గురువారం యాక్సెంచర్ ఈడీఐఐ ఆధ్వర్యంలో హౌస్‌హోల్డ్‌పై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హ్యాండ్ వాష్, ఫ్లోర్‌క్లీనర్ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈడీఐఐ శిక్షకులు రజిత, దేవేందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

అటవీ సంపదను రక్షించాలి

కుంటాల: అటవీ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అటవీ దినోత్సవం సందర్భంగా దౌనెల్లి అటవీ ప్రాంతంలో కుంటాల శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులకు క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, అనూష, వెన్నెల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లపై ఒత్తిడి చేయవద్దు



వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

ఖానాపూర్: కుటుంబసర్వే చేయాలని అంగన్‌వాడీ టీచర్లపై ఒత్తిడి చేయవద్దని గురువారం సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సరితకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన స్మార్ట్‌ఫోన్లు పనిచేయడం లేదన్నారు. నూతనంగా ఐపాడ్లు ఇచ్చేవరకు సర్వే చేయమని పేర్కొన్నారు. రోజు దినచర్య ఫొటోలు, ఎన్‌హెచ్‌టీఎస్‌లో వివరాలు నమోదు చేయాలని టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో విజయ, గీతాంజలి, పద్మ, మునేంద్ర, రామలక్ష్మి, రేఖ, రాజేశ్వరి, సంధ్య, ప్రమీల, సత్యక్క తదితరులు ఉన్నారు.

డీఎల్‌పీవో పర్యటన



ఎర్వచింతల్‌లో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది, కోలాంగూడ గ్రామాల్లో గురువారం డీఎల్‌పీవో రమేశ్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలతో పాటు హరిత హారం నర్సరీలను పరిశీలించారు. వారి వెంట ఎంపీవో చంద్రశేఖర్, హన్మంతు, వెంకటరమణ, మహేశ్, పిర్యా తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చులతో పూడికతీత

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో ఉన్న టవర్స్ కాలనీలో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలను గురువారం తొలగించారు. కౌన్సిలర్ పరిమి లతసురేశ్ స్వంత డబ్బులతో పొక్లెయిన్ ఏర్పాటు చేసి పూడికను తీయించారు. కాలనీలో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కౌన్సిలర్ పేర్కొన్నారు.

సంత.. సమస్యల చింత

- కనీస సౌకర్యాలు కరువు
- రోడ్డుకు ఇరువైపులా వ్యాపారం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



రోడ్డుకు ఇరువైపులా నిర్వహిస్తున్న వారసంత

తలమడుగు: మండలంలోని సుంకిడి ఆదివారం వారసంత నిర్వహణ ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్నా.. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రతీ ఏటా సంత వేలం నిర్వహించి వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తుంటారు. వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రతివారం వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. అయితే సంత నిర్వహణకు అనువైన స్థలం మాత్రం కేటాయించ లేదు. దీంతో రోడ్డు ఇరువైపులా వ్యాపారం నిర్వహించుకోవాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వ్యాపారులు చిన్నచిన్న పరదాలు కట్టుకొని వ్యాపారం సాగిస్తున్నారు.

అధిక ఆదాయం వస్తున్నా.. స్థలం కేటాయించడం లేదని వాపోతున్నారు.

ఎద్దుల సంత నిర్వహణకు స్థలం కేటాయించారు. కానీ కూరగాయలు, చిరు వ్యాపారులకు మాత్రం స్థలం కేటాయించ లేదు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. వ్యాపారం చేయాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం తాగేందుకు నీరు లేక, మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. రాత్రి 8 గంటల వరకు సంత నిర్వహణ ఉంటుంది. అయితే సరైన లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లోనే వ్యాపారం చేసుకుంటున్నారు.

ఆదాయం వస్తున్నా.. వసతులు సున్న

సంత నుంచి వచ్చే ఆదాయంపైన అధికారుల దృష్టి ఉంటుంది కానీ వసతులపైన ఉండడం లేదు. తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో అంతరాష్ట్ర రహదారి ఉండడంతో మహారాష్ట్ర వాసులు తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల వాసులు పెద్ద ఎత్తున సంతకు వచ్చి సరుకులు తీసుకెళ్తుంటారు. సంతలో కూరగాయలు పండ్లు, నిత్యావసర సరుకులతో పాటు ఎద్దుల క్రయవిక్రయాలు జరుగుతాయి. విక్రయించిన వారు ఎద్దుకు రూ. 100 చొప్పున చెల్లించాలి. ఒకొక్క దుకాణం నుంచి రూ. 20 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇంత ఆదాయం వస్తున్నా.. మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించడం లేదు. మహారాష్ట్ర అంతర్రాష్ట్ర రహదారి ఉండడంతో రోడ్డు ఇరువైపులా చిరు వ్యాపారులు సంత నిర్వహిస్తున్నారు. వర్షం కురిస్తే బురదలోనే వ్యాపారం చేసుకోవాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతలో కనీస వసతులు కల్పించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా

బోథ్: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని ఐటీడీవో పీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాల తహసీల్దార్లు, నాయిబ్ తహసీల్దార్లు, ఎస్సైలు, సెక్టార్ అధికారులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు వారి విధుల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. అనంతరం రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ‘కంది’



సీఎం రేవంత్‌రెడ్డితో కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జిల్లా నాయకులతో కలిసి భేటీ అయ్యారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లుగా కంది శ్రీనివాస్ తెలిపారు. అలాగే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా నాయకులకు దిశా నిర్దేశం చేసినట్లుగా పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ ఆశావాహ అభ్యర్థి ఆత్రం సుగుణ. తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఈవో



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఉట్నూర్‌రూరల్: పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న పులాజీ బాబా, జెడ్పీ పాఠశాల పరీక్ష కేంద్రాలను ఆమె సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరు, ఏర్పాట్లు, బందోబస్తు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాస్‌తో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో పిల్లలు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా ఆర్‌జేడీ సత్యనారాయణ్ రెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

26 నుంచి ఆలయ వార్షికోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ అష్టమ వార్షిక ఉత్సవాలు ఈనెల 26 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నట్లు ఖానాపూర్ గౌడ సంఘం నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని ఆలయ ఆవరణంలో వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26 నుంచి 30వరకు జోగుఎత్తుట, 31న పోచమ్మకు బోనాలు, ఏప్రిల్ 1న గంగస్నానం, పుట్టధని, 2న రేణుక ఎల్లమ్మకు బోనాలతోపాటు రేణుకామాత -జమదగ్ని మహారాజ్ కల్యాణోత్సంతో ఒగ్గుకథ కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కుంటాల: ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండలంలోని పెంచికల్‌పాడ్‌లో గురువారం రైతులు తమ పంట కుప్పల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,090 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులకు రూ.1980 నుంచి 2,040 వరకు అమ్ముకుంటూ నష్టపోతున్నామని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధుపటేల్, గోపాల్ పటేల్, గణేశ్‌పటేల్, కిష్టయ్య, రాంరెడ్డి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో గురువారం ప్రయాణికుల సౌకర్యార్థం సామాజిక కార్యకర్త బర్కాడే రాము ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్ చలివేంద్రాన్ని ప్రారంభించి, ప్రయాణికులకు నీటిని అందించారు. కార్యక్రమంలో నాయకులు బోనిరిగివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, శివకుమార్, సలాం దేవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎమ్మెల్యేను కలిసిన సంఘం నాయకులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గంగపుత్ర సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా రింగని వసంత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఇప్ప నందు, ఉపాధ్యక్షుడిగా విలాస్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి సంఘం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. వారివెంట బీఆర్‌ఎస్ నాయకుడు షేక్ అఫ్రోజ్, గణపతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండంలోని అడేగామ(కె)లో గురువారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది శేఖర్, దేవురావులు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ రైతు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు.

పరీక్ష కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఇంద్రవెల్లి: పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని ఎస్సై సునీల్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు కేస్లాపూర్ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడారు. ఎలాంటి సమస్య ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకోరావాలన్నారు. పరీక్ష సమయంలో బయటివారు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డీఎఫ్‌వో

నేరడిగొండ: ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా రైటింగ్ అండ్ పెయింటింగ్ పోటీలను జిల్లా అటవీశాఖ అధికారులు గురువారం నిర్వహించారు. బుగ్గారం(బి)టీటీడబ్ల్యూఆర్‌జేసీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో ప్రశాంత్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శ్రీకాంత్

ఉట్నూర్‌రూరల్: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని బీర్సాయిపేట ఎఫ్ఆర్‌వో గులాం మొయినొద్దీన్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా అటవీ అధికారులు ర్యాలీ నిర్వహించారు. భూమిపై ఉన్న ప్రాణులు జీవించాలంటే అడవుల విస్తీర్ణం పెంచాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం అటవీ అధికారులు చేపడుతున్న మొక్కలు నాటడం, గడ్డి పెంచడం, నీటి వసతి కల్పించడం వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: అడవుల రక్షణతో పాటు జంతువుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని జిల్లా బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపినాథ్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలో జీవవైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అన్నిరకాల మొక్కలతో పాటు చెట్లను పెంచాలన్నారు. జంతువుల సంరక్షణకు కృషి చేయాలని కోరారు. అడవులతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో సన్‌షైన్ పాఠశాల నిర్వహకులు నర్సయ్య, గణేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్‌టౌన్: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ప్రభుత్వ బాలికల పాఠశాల, సెంట్రల్ లైబ్రరీలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటుహక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నమోదు కోసం ఫారం 6 నింపి బూత్ లెవల్ అధికారులకు సమర్పించాలని కోరారు. పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: గ్రామ నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని వాగ్ధారి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కల రక్షణ కోసం షెడ్, నెట్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తరచూ నీటి తడులు అందేలా చూడాలన్నారు. మొక్కలు పెరగడానికి సేంద్రీయ ఎరువులు వినియోగించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. వేసవిలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో శబరి మాత విగ్రహ ప్రతిష్ఠాపనను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన వేడుకలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు గ్రామంలోని పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో వేద పండితుల మధ్య హోమం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి చొరవ చూపడం అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్: ఆర్థికంగా వెనుకబడి ఉన్న మున్నూరుకాపు కులస్తుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ తాలూకా మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య భవనంలో నిర్వహించిన మున్నూరుకాపు కులస్తుల రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా నుంచి ఆయన పాల్గొన్నారు. కార్పొరేషన్‌కు మున్నూరుకాపు కులానికి చెందిన వారినే నియమించాలన్నారు. కులస్తుల ఆర్థికాభివృద్ధికి ఏడాదికి రూ. 2వేల కోట్ల చొప్పున ఐదేళ్లకు రూ. 10వేల కోట్లు విడుదల చేయాలని తీర్మానం చేశారు. భవన నిర్మాణం కోసం రూ. 3 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సిరిచెల్మ మల్లన్న జాతర



అగ్ని గుండం నుంచి వెళ్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని అతిపురాతన సిరిచెల్మ మల్లికార్జున ఆలయ జాతర గురువారం ముగిసింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నుంచి భక్తులు నడుస్తూ.. మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఘనంగా రథోత్సవం నిర్వహించారు. ఈ రెండు ఘట్టల నిర్వహణతో జాతర ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో చెరువులో స్నానాలు ఆచరించి మల్లికార్జున్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. పంచాయతీ ప్రత్యేకాధికారి జాదవ్ రామారావు ఏర్పాట్లను పర్యవేక్షించగా.. ఎస్సై నరేశ్ అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.